అగ్గిపడితే.. బుగ్గేనా?

- బోథ్‌లో ఫైర్‌స్టేషన్ కరువు
- కాలిబూడిదవుతున్న ఆస్తులు
- నీటి మూటలుగానే నాయకుల హామీలు
- తాజాగా బోథ్‌లో కాలిపోయిన ఇల్లు


ఆర్థిక సాయం చేస్తున్న ఎంపీపీ తుల శ్రీనివాస్


గతంలో కాలిబూడిదైన మిషన్ భగీరథ పైపులు (ఫైల్)

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఫైరింజన్ మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. అగ్నిమాపక యంత్రం అందుబాటులో లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తే ఆస్తులు కాలిబుడిద అవాల్సిందే. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకునే లోపే పూర్తిగా కాలిపోయి నష్టం వాటిల్లుతోంది. గత రెండు దశాబ్దాలుగా మండలంలో ఫైరింజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. అయినా పాలకులు పట్టించుకోవడం లేదు.

ఇల్లు దగ్ధం..

తాజాగా బోథ్ మండల కేంద్రంలో ఆదివారం రాథోడ్ సూర్యకళ అనే మహిళకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. ఇంట్లో ఉన్న సామగ్రి, వస్తువులు దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఆర్ఐ దశరథ్ పంచనామాలో పేర్కొన్నారు. ఆదివారం అర్ధరాత్రి 10వ వార్డులో పెంట కుప్ప కూడా కాలిపోయింది. సోమవారం ఉదయం మండల కేంద్రంలో ఓఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పివేశారు.

బోథ్‌లో జరిగిన అగ్ని ప్రమాదాలు..

- బోథ్‌లో న్యూకాలనీకి చెందిన ముస్లిం కుటుంబానికి చెందిన ఇల్లు ఇటీవల కాలి బూడిదయింది.
- బోథ్ మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో రెండు ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ. 5 లక్షల ఆస్తి నష్టం సంభవించింది.
- బోథ్ మండల కేంద్రంలో రెండేళ్ల క్రితం వేసవిలో జిన్నింగ్ అగ్ని ప్రమాదం జరిగి, రూ. 20 లక్షల పత్తి కాలిపోయింది.
- నీటిపారుదల కార్యాలయంలో నిల్వ ఉంచిన మిషన్‌భగీరథ పైపులు అగ్నికి ఆహుతై రూ. 30 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



బోథ్ మండల కేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. గత 15 సంవత్సరాల క్రితం ఇల్లు అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఉన్న వస్తువులు, బంగారం, నగదు కాలి పోయాయి. కట్టుబట్టలతో బయటకు వచ్చాం. ఎవరూ కూడా సాయం చేయలేదు. ప్రభుత్వం స్పందించి ఫైర్‌స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

– మీర్ ఇర్షాద్ అలీ, బోథ్

స్పందించిన మానవతావాదులు..

బోథ్ మండల కేంద్రానికి చెందిన రాథోడ్ సూర్యకళ ఇల్లు కాలిపోయిన విషయం తెలియగానే ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. తహసీల్దార్ అతికోద్దీన్ ప్రభుత్వం తరపున రూ. 8 వేలు, సర్పంచ్ సురేందర్ యాదవ్ రూ. 5 వేలు, గ్రామానికి చెందిన మీర్ ఇర్షాద్ అలీ రూ. 5 వేలు అందించారు. మాజీ వార్డు సభ్యులు లింగారెడ్డిలు తాత్కాలికంగా మహిళ ఉండడానికి గది ఇచ్చారు.

కష్టపడి పని చేస్తేనే గుర్తింపు


పాయల్ శంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్: బీజేపీలో కష్టపడి పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో ఇటీవల బీజేపీలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ఉష్కం రఘుపతి, పీఆర్టీయూ మాజీ అధ్యక్షుడు ధారట్ల జీవన్‌తో పాటు పలువురు పార్టీలో చేరారు. దీంతో సోమవారం పాయల్‌శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శివ, విఠల్, జైపాల్, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారానికి పోరాటం'

ఆదిలాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నిరంతరం పోరాడుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నూతన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. అంగన్‌వాడీ ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రం చొరవ చూపినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి సంతోష్, అశ్విత్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు


కిరాణ షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: వ్యాపారస్తులు పీడీఎస్ బియ్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై సునీల్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని పలు వ్యాపార కిరాణషాపుల్లో తనిఖీలు నిర్వహించారు. వ్యాపారస్తులు పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే నిత్యావసర సరుకులను అధిక ధరలకు అమ్మి ప్రజలను మోసం చేసినా.. కాల పరిమితి దాటిన సరుకులు అమ్మినా.. కేసులు నమోదు చేస్తామన్నారు. ఏఎస్సై భీంరావ్, పోలీసు కానిస్టేబుల్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు 'కంటివెలుగు'


కంటివెలుగు ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ

నార్నూర్: అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటివెలుగు శిబిరాలను నిర్వహిస్తోందని వైస్ ఎంపీపీ యోగేశ్ అన్నారు. సోమవారం గాదిగూడ మండలంలోని ఖండోవ్‌లో కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రహారి, ఎంపీటీసీ కిరణ్, వైద్యురాలు స్వప్న, హెచ్ఈవో రవీందర్ పాల్గొన్నారు.

మేదరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: మేదరి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఊరే దినేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్, మావల తహసీల్దార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఊరే గణేష్, పిల్లి నరేష్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పిల్లి భాగ్యలక్ష్మి, పిల్లి రాజశేఖర్, వినోద్, గంగన్న, జితేందర్, శివ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి సంతాపం

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన వైద్య విద్యార్థులు ప్రీతి, హర్షల మృతికి ఆదిలాబాద్ రిమ్స్ వైద్య విద్యార్థులు సంతాపం ప్రకటించారు. సోమవారం రిమ్స్ ఆసుపత్రిలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు సుమలత, తానాజీ, శ్యాంసుందర్, సంజయ్ గవాలే, తదితరులు పాల్గొన్నారు.

'మహిళా లోకానికి ఎమ్మెల్సీ కవిత కలంకం'

ఆదిలాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత లిక్కర్ వ్యాపారం చేస్తూ తెలంగాణ మహిళా లోకానికి కలంకం తీసుకొస్తున్నారని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ధోని జ్యోతి అన్నారు. భారత జాగృతి ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనాన్ని నిరసిస్తూ వినాయక్ చౌక్‌లో సోమవారం ఎమ్మెల్సీ కవిత దిష్టిబొమ్మ దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మ, రాణి, పాచ్చు, రమ్యకృష్ణ, లలిత పాల్గొన్నారు.

రోడ్డుపైనే శనగ కుప్పలు


రోడ్డు పక్కన పోసిన శనగ కుప్పలు

తాంసి: మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో సోమవారం నుంచి శనగపంట కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. మండలంలోని పొన్నారి, కప్పర్ల రైతులు పెద్దఎత్తున శనగపంటను మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చారు. నిల్వ చేసేందుకు సరైన స్థలం లేక రైతులు రోడ్డుపైనే కుప్పలు పోశారు. అధికారులు సరైన సౌకర్యాలు కల్పించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మార్కెట్లో హోలీ సందడి



ఆదిలాబాద్: హోలీ పర్వదినాన్ని మంగళవారం జరుపుకోనున్న నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సోమవారం సందడి వాతావరణం నెలకొంది. మార్కెట్లో ఎక్కడ చూసినా చిన్నారులు వారి తల్లిదండ్రులతో కలిసి రంగుల కొనుగోళ్లు చేస్తూ.. కనిపించారు. అంబేద్కర్, గాంధీ చౌక్ కూడళ్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాల్లో మాస్కులు, బూరలు, పిచికారీలను అందుబాటులో ఉంచారు.



నీటి ఎద్దడి లేకుండా చర్యలు

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్


పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: వేసవిలో పట్టణ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. పట్టణంలో జరుగుతున్న మిషన్ భగీరథ పనులను సోమవారం పరిశీలించారు. వాటి పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణంలో ఉన్న మున్సిపల్ నూతన కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. వినాయక్ చౌక్‌లో జరుగుతున్న పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలించి, సత్వరం పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ధమ్మపాల్, భూమన్న, ప్రశాంత్ పాల్గొన్నారు.

జర్నలిస్టుకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న జర్నలిస్టులు

గుడిహత్నూర్: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నాగుల సతీష్ (36) గత కొన్ని రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లో శస్త్ర చికిత్స చేసుకొని ఇంటికి వచ్చాడు. వి విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజేహెచ్ (143) అధ్యక్ష, కార్యదర్శులు బేత రమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్.రాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గంగాధర్ సింధే, నాయకులు సువర్ణ మహాదేవ్, కరణ్‌రెడ్డి, శంకర్, స్థానిక జర్నలిస్టులు కొండా ప్రశాంత్, గన్నోజి శ్రీనివాస్ పరామర్శించారు.

సతీష్‌ను ఆదుకుంటా..

సీనియర్ జర్నలిస్ట్ సతీష్‌ను ఆదుకోవడంలో ముందుంటానని ఏఐసీసీ సభ్యుడు నరేష్ జాదవ్ హామీ ఇచ్చారు. తన వంతుగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేసి సతీష్ కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట నాయకులు జాదవ్ వసంత్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, సీనియర్ నాయకులు నాగ్‌నాథ్ అప్పా, జాదవ్ వసంత్, అశోక్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


అవగాహన కల్పిస్తున్న సఖీ కేంద్రం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు, యువతులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం లీగల్ కౌన్సిలర్ మంజులత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం సఖీ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సఖీ కేంద్రం ద్వారా ఐదు రకాల సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఎవరైనా వేధింపులకు గురిచేస్తే 181, 1098, 100కు డయల్ చేయాలన్నారు. గృహ హింస చట్టం, పోక్సో, బాల్య వివాహాల గురించి వివరించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కౌన్సిలర్లు లావణ్య, సంఘమిత్ర, కళాశాల ప్రిన్సిపల్ జగ్‌రాం, లెక్చరర్లు జాకిర్ హుస్సేన్, అనిత పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తలమడుగు: మండలంలోని అర్లి(కె) గ్రామంలో శబరిమాత ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ నారు కిష్టన్న, భీంరెడ్డి, సురేందర్‌రెడ్డి, ఎంపీటీసీ, సుస్మిత రమేష్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

లోక భూమారెడ్డి జన్మదిన వేడుకలు


కేక్‌కట్ చేస్తున్న లోక భూమారెడ్డి

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలోని మాజీ విజయ డైయిరీ చైర్మన్ లోక భూమారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సోమవారం గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు మధ్య కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు, పుష్పాగుచ్ఛాలు ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోతరెడ్డి, కేదేశ్వర్ రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, గంగన్న, ఉత్తమ్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. డీఈవో ప్రణీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్‌కు ధీటుగా నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. సర్పంచ్ మయూరి, ఎస్ఎంసీ చైర్మన్ గోపాల్, ప్రధానోపాధ్యాయుడు నాగేందర్, సిబ్బంది రమేష్ బాబు, ప్రతాప్, ప్రవీణ్, ఖయ్యుం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరామర్శ

నేరడిగొండ: నిర్మల్ జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి తండ్రి ఎర్ర గంగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సోమవారం నేరడిగొండ మండలంలోని తర్నం(కె) గ్రామంలోని వారి నివాసానికి చేరుకొని కుటుంబసభ్యులను పరామర్శించారు. నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్‌లు సైతం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గంగారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బేల పశు వైద్యాధికారిగా వైద్య సుదేష్

బేల: మండల కేంద్రంలోని పశు వైద్యశాల వైద్యాధికారిగా వైద్య సుదేష్‌ను నియమిస్తూ జిల్లా పశుసంవర్ధక శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఆదిలాబాద్: దేశ సేవ చేయాలనే జిల్లాలోని గ్రామీణ పట్టణ నిరుద్యోగ యువతకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు ఆదిలాబాద్ డిఫెన్స్ అకాడమీ ప్రారంభించడం జరిగిందని అకాడమీ నిర్వాహకులు, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదూరి గోవర్ధన్ రెడ్డి తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ఇంద్రవెల్లి: మండలంలోని దనోర(బి) గ్రామానికి చెందిన ఆత్రం తిరుపతి ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆయన ఇంటిని పరిశీలించి, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నాయకుడు పెందోర్ ప్రభాకర్, జాదవ్ సునీల్, మహ్మద్ సిరజోద్దిన్, దుర్వ మహేశ్ పాల్గొన్నారు.

మహిళలకు సన్మానం

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ బస్ డిపో ఆధ్వర్యంలో ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలను ఘనంగా సన్మానించారు. ఈపీకే కలెక్షన్ తెచ్చిన మహిళ కండక్టర్లకు ఉత్తమ పురస్కారం అందజేశారు. ఉష తాయి, అనసూయ, డాక్టర్ హరిప్రియ, టీచర్ వాణి, ఐటీడీఏ ఉద్యోగిని సురేఖ, ఇందిరా, లక్ష్మిలు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళ చట్టాలపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ పంద్రం శంకర్, సర్పంచ్ సుగుణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఆదివాసీలు

బోథ్: మండలంలోని పార్డి(బి) రాయిసెంటర్ పరిధిలోని ఆదివాసీలు సోమవారం ఎమ్మెల్యే బాపురావును మర్యాద పూర్వకంగా కలిశారు. సీసీరోడ్లు వేయాలని, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు.

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి

బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ తహసీల్దార్ అతికోద్దిన్‌కు సోమవారం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. ఫైర్‌స్టేషన్ లేకపోవడంతో లక్షల్లో ఆస్తినష్టం సంభవిస్తోందని గ్రామస్తుడు మీర్ ఇర్షాద్ అలీ పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

బోథ్: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో బోరు వేయించిన ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు సోమవారం మహిళా సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

అండగా ఉంటాం

బోథ్: మండల కేంద్రానికి చెందిన రాథోడ్ సూర్యకళకు ఇల్లు ఆదివారం అగ్ని ప్రమాదం కాలిపోయింది. కాగా కాంగ్రెస్ ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్ బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. నిత్యావసర సరుకులు, కొంత నగదును అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు.

'ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్, బీజేపీ'

ఆదిలాబాద్‌రూరల్: ప్రజా సమస్యలపై మాట్లాడకుండా బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో మాట్లాడారు. గత రెండు రోజుల కిందట ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సిమెంట్ ఫ్యాక్టరీ (సీసీఐ) పునరుద్ధరణ, గిరిజన యూనివర్సిటీ విషయంపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మెస్రం జంగుబాపు, రత్నపురం రమేశ్, లక్ష్మణ్ యాదవ్, సృజన్ పాటిల్, సంతోష్, ఛత్రపతి పాల్గొన్నారు.

సమాచారం

నేడు అంతర్‌రాష్ట్ర కుస్తీ పోటీలు

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో అంతర్‌రాష్ట్ర కుస్తీ పోటీలను మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మైదానంలో నిర్వహించనున్నట్లు సర్పంచ్ పరచ లావణ్యసాయన్న తెలిపారు. మల్లయోధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో మంగళవారం నుంచి శ్రీసీతారామచంద్ర స్వామి ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పురోహితుడు ఎల్కుచి శ్రావణ్ కుమార్ జోషి (రాజు) తెలిపారు. శ్రీ సీతారామ చంద్రస్వామి, లక్ష్మణ, హనుమాన్, శివపంచాయతన, పంచముఖి హనుమాన్, యంత్ర, విగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

రేపటి నుంచి శనగ కొనుగోళ్లు

బజార్‌హత్నూర్: ఈనెల 8 నుంచి మండలంలోని దేగామ గ్రామంలో శనగ కొనుగోళ్లు చేపడుతామని ప్యాక్స్ చైర్మన్ మేకల వెంకన్న యాదవ్ తెలిపారు. 8, 9న చింతలసాంగ్వి, 10, 11న బజార్‌హత్నూర్, 13, 14న దేగామ, 15న కొలారి, 16న టెంబి, అనంతపూర్, 17, 18న పిప్రి, 20న వర్తమన్నూర్, మోహద, 21,22, 23న గిర్నూర్, కాండ్లి, కనకదుర్గ, 24న బండ్రేవ్, బలన్‌పూర్, 25, 26, 27నభూతాయి(బి), భూతాయి(కె), 28, 29న జాతర్ల, 30న ధరంపురి, హర్కాయి, కిన్నెరపల్లి, 31న మోర్కండి, ఏప్రిల్ 1న బోస్రా, 3, 4న దిగ్నూర్, గంగాపూర్, 5న రాంపూర్, 6న గోకొండ, దాబాడి, 8న గిరిజాయి, మాన్కపూర్, ఉమార్డ రైతుల శనగ పంటను కొనుగోలు చేస్తామని తెలిపారు.

యువత బీజేపీ వైపు చూస్తోంది

బోథ్: యువత బీజేపీ వైపు చూస్తోందని గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. సోమవారం మండలంలోని పట్నాపూర్ పర్యటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుభాష్ సూర్య, భోజన్న, బడాల శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.


నార్నూర్: కామదహనం చేస్తున్న గిరిజనులు


నేరడిగొండ: కుమారి గ్రామంలో..


తాంసి: హోలీ వేడుకలో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా కామ దహనం

జిల్లా వ్యాప్తంగా గిరిజన గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, కామ దహనాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం అటవీ ప్రాంతం నుంచి వెదురు బొంగులు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో ఇంటింటికీ వెళ్లి కుడుకలు, చక్కర బిల్లలు సేకరించారు. వెదురు బొంగులకు మోదుగ పూలు, చక్కర బిల్లలు, నైవేద్యం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పొలిమేరలో కామ దహనం నిర్వహించారు. మంగళవారం హోలీ ఆడనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్

ముందస్తు హోలీ సంబురాలు

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఒక్కరిపై ఒకరూ రంగులు చల్లుకుంటూ.. సందడి చేశారు. డీజే పాటలకు నృత్యం చేసి సందడిగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శిల్ప సర్పంచ్ లింబాజీ, ఉపాధ్యాయులు శివారెడ్డి, రాజు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: పూజలు చేస్తున్న ఆదివాసీలు